క్లుప్తంగా

సబ్సిడీ బియ్యం, కందిపప్పు కౌంటర్ ఏర్పాటు



సబ్సిడీ కౌంటర్ ఏర్పాటుచేస్తున్న తహశీల్దార్

ఉలవపాడు: ధరల నియంత్రణలో భాగంగా స్థానిక సాయి జనరల్ స్టోర్ వద్ద సబ్సిడీ పై బియ్యం, కందిపప్పు అమ్మకాల కౌంటర్‌ను ఏర్పాటుచేసినట్లు తహశీల్దార్ చంద్రారెడ్డి తెలిపారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వినియోగదారుల సౌకర్యార్థం అంబేద్కర్ బొమ్మ వెనుక ఉన్న సాయి జనరల్ స్టోర్ వద్ద ఈ కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశవాళీ కందిపప్పు మార్కెట్‌లో రూ.181 ఉండగా ఈ కౌంటర్‌లో రూ.160 అమ్మనున్నట్లు పేర్కొన్నారు. బీపీటీ బియ్యం మార్కెట్‌లో 55.85 ఉండగా ఈ కౌంటర్ వద్ద రూ.49 రాబియ్యం మార్కెట్ లో రూ.52.40 ఉండగా కౌంటర్ వద్ద రూ.48లకు అందిస్తామన్నారు. వినియోగదారులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న యూనిట్ ఇన్‌చార్జి విజయలక్ష్మి

టంగుటూరు: మండలంలోని కందులూరు గ్రామంలో సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయం ద్వారా అడుసుపల్లి సుజాత అనే రైతు 30 సెంట్ల స్థలంలో 30 రకాల కూరగాయలు పండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో కూరగాయల ధరలు అధికంగా ఉన్నాయని తెలిపారు. పలు రకాల రసాయనాలతో పంటలు పండిస్తూ ఆ కూరగాయలు తినడం వలన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్న విషయం అందరికీ తెలుసన్నారు. తనకున్న 30 సెంట్లలో పలురకాల కూరగాయలను రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించడం జరుగుతోందన్నారు. యూనిట్ ఇన్‌చార్జి తుమ్మలపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ కూరగాయలు, ఆకుకూరలు ప్రకృతి విధానంలో సాగుచేస్తే ఆరోగ్యకరమైన కూరగాయలు తింటూ అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అదే విధంగా అధికంగా పండించిన పంటను బయట అమ్ముకుంటూ జీవనం సాగించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు ఐసీఆర్‌పీ మరియమ్మ, హరిత, జోత్స్న, త్రివేణి, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చెత్త సమస్య తొలగేదెప్పుడు...?

- పట్టణానికి తీవ్ర సమస్యగా మారిన డంపింగ్‌యార్డు
- ఇప్పటికే చెత్తతో నిండిపోయిన డంపింగ్ యార్డు, దుర్గంధం, పొగతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- కొలిక్కిరాని నూతన డంపింగ్‌యార్డు సమస్య
- రోజుకు పట్టణంలో 26 టన్నుల చెత్త ఉత్పత్తి



పూర్తిగా చెత్తతో నిండిపోయిన డంపింగ్‌యార్డు

కందుకూరు: కందుకూరు పట్టణానికి ప్రస్తుతం చెత్త తరలింపు పెద్ద సమస్యగా మారింది. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణం టన్నుల కొద్ది వస్తున్న చెత్తను ఎక్కడ డంప్ చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఉన్న డంపింగ్‌యార్డు పూర్తిగా చెత్తతో నిండిపోవడం, నూతన డంపింగ్‌యార్డు సమస్య కొలిక్కి రాకపోవడంతో అటు మున్సిపల్ అధికారులు, ఇటు పట్టణ ప్రజలకు ఈ సమస్య తలనొప్పిగా మారింది.

రోజుకు 26 టన్నుల చెత్త..

ప్రస్తుతం మున్సిపల్ అధికారులు రూపొందించిన నూతన మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ ప్రకారం కందుకూరు మున్సిపాలిటీ విస్తీర్ణం 60.32 చ.ద.కీ. ప్రస్తుతం 70వేల మంది వరకు నివాసం ఉంటారని అంచనా. రోజువారీగా ఇంటి అవసరాలు, వ్యాపార సంస్థలు, దుకాణాలు, హోటల్స్ ఇలా తదితరాల నుంచి ప్రతి రోజు 26 టన్నుల వరకు చెత్త ఉత్పత్తి అవుతోంది. నిత్యం 141 మంది మున్సిపల్ కార్మికులు నిత్యం చెత్త సేకరణ కోసం పనిచేస్తున్నారు. అయితే అంతా బాగున్నా సేకరించిన చెత్తను డంప్ చేసే విషయమే ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది. ప్రస్తుతం పట్టణంలోని దక్షిణం వైపు గుర్రంవారిపాలెం, ముత్తరాశిపాలెం ప్రాంతాల సమీపంలో డంపింగ్ యార్డు ఉంది. ఆ డంపింగ్‌యార్డుకే ప్రస్తుతం రోజువారీ సేకరిస్తున్న చెత్తను అధికారులు తరలిస్తున్నారు. అయితే ఈ డంపింగ్‌యార్డు ఐదారేళ్ల క్రితమే పూర్తిగా చెత్తతో నిండిపోయింది. కొంత కాలం చెత్తను ప్రాసెసింగ్ చేసినా ఆ తరువాత అది కూడా మూలనపడి పోయింది. దీంతో ప్రస్తుతం డంపింగ్ యార్డులో అంగుళం కూడా ఖాళీ లేని పరిస్థితి నెలకొంది. దీంతో వేసిన చోటే చెత్తను వేస్తూ, దహనం చేస్తూ అధికారులు నానా తిప్పలు పడుతున్నారు. అదే సందర్భంలో చెత్త దహనం వల్ల పరిసర ప్రాంత కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్‌యార్డు నుంచి వచ్చే పొగతో కనీసం ఇళ్ల కూడా ఉండలేని దుస్థితి నెలకొంది. ఈ పొగ వల్ల అనేక మంది ఊపిరి తిత్తుల సమస్యలతో బాధపడుతున్నారని, ఒకసారి నిప్పు అంటుకుంటే రోజుల తరబడి కాలుతూనే ఉంటుంది. దీంతో పొగ పరిసర ప్రాంత ఇళ్లను కమ్మేస్తుంది. ఈ పొగ వల్ల ఊపిరి తీసుకోవడం కూడా కష్టంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సమస్యకు ఓ పరిష్కారం చూపాలని, విస్తరిస్తున్న పట్టణానికి అనుగుణంగా ప్రస్తుతం నివాసాల మధ్యలోకి డంపింగ్‌యార్డు వచ్చిందని, కావున డంపింగ్‌యార్డును అక్కడి నుంచి తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఖాళీ లేకపోవడంతో డంపింగ్‌యార్డు పక్కనే వేసిన చెత్త

స్థలం ఎక్కడ..?

ఈ నేపథ్యంలో నూతన డంపింగ్‌యార్డు కోసం దూబగుంట వద్ద ఓ స్థలాన్ని ఎంపిక చేశారు. అయితే ఆ స్థలంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు కోర్టుకు వెళ్లారు. దీంతో ఈ సమస్య ఎటూ తెగని సమస్యగా మారిపోయింది. దాదాపు ఐదారేళ్ల నుంచి అలాగే పెండింగ్‌లో పడిపోయింది. దీంతో అధికారులు డంపింగ్‌యార్డు కోసం మరో ప్రత్యామ్నాయ స్థలం దొరకని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కోర్టులో ఉన్న సమస్య పరిష్కారమైతే నూతన డంపింగ్‌యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, ప్రస్తుతం ఉన్న డంపింగ్‌యార్డును అక్కడి నుంచి తరలిచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్తున్నారు. నూతన డంపింగ్‌యార్డు సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రస్తుత డంపింగ్‌యార్డులోనే చెత్త వేయక తప్పవని చెప్తున్నారు. దీంతో ఈ సమస్యకు ఎప్పటికి పరిష్కారం లభిస్తుందోనంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కారంచేడు అమరవీరులకు నివాళులు



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు



నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

కందుకూరు: జాషువా సాహిత్య, సాంస్కృతిక సంస్థ, ఏఏడీ అసోసియేషన్, ధమ్మచక్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కారంచేడు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది ముప్పవరపు కిశోర్ మాట్లాడుతూ ఈ దేశ మూలవాసులైన దళిత, బహుజన రాజ్యాధికార స్థాపన జరిగితేనే కులతత్వం, మతత్వం, అమానుషత్వం అంతమవుతుందని తెలిపారు. సామాజిక ఉద్యమనేత గేరా చిరంజీవి మాట్లాడుతూ అంబేద్కర్ చూపించిన గణతంత్ర, లౌకిక, ప్రజాస్వామ్యబద్ధంగానే వివక్షతలపై పోరాడాలని, అంబేద్కర్ బాటలోనే కొనసాగాలని తెలిపారు. ధమ్మ చక్ర ఫౌండేషన్ అధ్యక్షుడు, ఉపాసకుడు గాండ్ల హరిప్రసాద్ మాట్లాడుతూ కారంచేడు లాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండాలంటే గౌతముడు చూపిన సమానత్వం, సౌభ్రాతృత్వం వెలుగులో మానవాళి జీవనం కొనసాగించాలని తెలిపారు. ఏఏడీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చనమాల కోటేశ్వరరావు, పంది వెంకటగిరిబాబు, మిడసల మాధవరావు పాల్గొన్నారు.

టంగుటూరు: మండలంలోని దళిత నాయకుల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కారంచేడు మృతవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా చప్పిడి వెంగళరావు పాల్గొని మాట్లాడారు. దళితులు తాగే మంచినీటి చెరువులో పశువులు కడిగారని అడిగినందుకు దళితకాలనీ మీద పడి దాడి చేసి చంపడం అమానుషమని అన్నారు. కారంచేడులో జరిగిన ఈ సంఘటనపై దళితులంతా పోరాడి కారంచేడు, చుండూరు ఉద్యమాల ద్వారా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ తెచ్చుకోగలిగామన్నారు. కార్యక్రమంలో దళిత రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు, బొడ్డు రవీంద్ర, ఎంపీటీసీ కొమ్ము ప్రభుదాసు, బ్రహ్మయ్య, ఉజ్వల్, జగదీశ్‌పాల్గొన్నారు.



విశిష్ట అలంకరణలో సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహ మూర్తులు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కనులపండువగా కల్యాణోత్సవం

పామూరు: పామూరు అంకాళమ్మవీధి సమీపంలోని వడ్డెపాలెం కోదండరామస్వామి తిరునాళ్ల సందర్భంగా స్వామి శాంతి కల్యాణం అర్చకుల వేదమంత్రాల నడుమ బుధవారం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా అర్చకులు మొదట సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తులకు అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం సీతా, రమా చంద్రమూర్తుల విగ్రహమూర్తులకు వేడుకగా ఎదురుకోల నిర్వహించి కల్యాణ మండపానికి చేర్చారు. అనంతరం రుత్వికులు వేదమంత్రాలతో శాంతి కల్యాణం జరిపించారు. కల్యాణానంతరం సాయంత్రం స్వామివార్ల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదానం నిర్వహించారు.

టీఆర్‌ఆర్ కళాశాలకు అటానమస్ హోదా



టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కందుకూరు: టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) 2024–25 విద్యా సంవత్సరం నుంచి అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదా ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవికుమార్ తెలిపారు. ఈ అటానమస్ హోదా 10 ఏళ్ల పాటు అమల్లో ఉంటుందని తెలిపారు. అటానమస్ హోదా రావడం వల్ల కళాశాల మరింత అభివృద్ధి చెందడంతో పాటు విద్యార్థి జ్ఞానాన్ని, ఉపాధి కల్పన నైపుణ్యాన్ని మరింతగా పెంపొందించడానికి దోహదపడుతుందని తెలియజేశారు. ఈ హోదా వల్ల కళాశాల తమ సిలబస్‌ను తామే రూపొందించుకునే అవకాశం ఉందని, విద్యార్థులకు ఉపయోగపడే అనేక నూతన కోర్సులు ప్రవేశపెట్టి వారిని నూతన సమాజ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దవచ్చని వివరించారు. ఈ విద్యా సంవత్సరంలోనే రాష్ట్రంలోనే అత్యధిక సీజీపీ 3.44 స్కోరుతో నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించడం, అటానమస్ హోదా సాధించడం కళాశాల ప్రతిభా పాటవాలకు గీటురాయిని అన్నారు. ఈ అటానమస్ సాధించడానికి దోహదపడిన విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి, కళాశాల పూర్వ విద్యార్థులకు, సహకరించిన ప్రజాప్రతినిధులకు ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ అటానమస్ హోదా వచ్చిన అవకాశాన్ని కందుకూరు పరిసర ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, కళాశాలలో చేరి తమ బంగారు భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



పీర్ల సలాముల ఉత్సవాలు

కనిగిరి రూరల్: మొహర్రం వేడుకలు బుధవారం రాత్రి షహదత్ నామా అల్‌విదాతో ముగిశాయి. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత పెదషరిగత్తు వేడుకలతో ప్రారంభమై పీర్ల గ్రామోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. వివిధ మకాన్‌లకు చెందిన అక్బర్‌అలీ, పాదిలి సాహెబ్, ఇమామే హుస్సేన్, బారాయిమామ్, గిద్దలూరు సాహెబ్, ఇమామేఖాశిం తదితర నామకరణాలు కలిగిన పీర్ల (హజరత్)ను సుందరంగా తీర్చిదిద్ది పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. పీర్ల చావిడి వద్ద బుధవారం వేకువజామున జరిగిన పీర్ల అగ్నిగుండ ప్రవేశాన్ని వీక్షించేందుకు ప్రజలు తండోపతండాలుగా వచ్చారు. వివిధ మకాన్‌లకు చెందిన వివిధ నామకరణాలు కల్గినపీర్లు పాతూరు సెంటర్, బొడ్డుచావిడి సెంటర్, పామూరు బస్టాండ్ సెంటర్ లలో సలాములు అందుకున్నారు. సలాముల మహోత్సవాన్ని తిలకించేందుకు వేకువజామున మహిళలు అధిక సంఖ్యలో వచ్చారు. తిరిగి మధ్యాహ్నం ఆయా మకాన్‌ల వద్దకు పీర్లు వెళ్లాయి. పీర్లు బావికి(జలధి) వెళ్లే కార్యక్రమం బుధవారం రాత్రి నియమనిష్ఠలతో చేశారు. పీర్ల జలధి కార్యక్రమం అనంతరం తిరిగి చావిడికి తీసుకుని వెళ్లడంతో మొహర్రం ముగిసింది. డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ దాసరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో, ఎస్సై టి. త్యాగరాజు భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. కాగా పీర్ల సలాముల ఉత్సవం సందర్భంగా కొద్ది సేపు ఉద్రిక్తత చోటుచేసుకోగా పెద్దలు జోక్యం చేసుకొని గొడవను సద్దుమణిగించారు.

వెలిగండ్ల: మొహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు. మండలంలోని వెలిగండ్ల, కంకణంపాడు, జంగంనరసాయపల్లి తదితర గ్రామాల్లోని పీర్ల చావిడిలను విద్యుత్‌దీప, పూలంకరణతో సుందరంగా అలంకరించారు. కొలువైన పీర్లకు విశిష్ట పూజలు చేశారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించాలి

కందుకూరు: కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన కట్టడాలను వెంటనే తొలగించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, కార్యవర్గ సభ్యుడు హుస్సేన్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పామూరు రోడ్డులోని సర్వే నంబర్ 875–2లో కోట్లు విలువ చేసే 0.48సెంట్ల స్థలాన్ని కొందరు ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మించారని, దీనిపై రెవెన్యూ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ప్రభుత్వ స్థలాలను కాపాడలేని దుస్థితిలో అధికారులు ఉన్నారని చెప్పారు.

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు



విశిష్ట అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథస్వామి మూలవిగ్రహమూర్తి



ప్రత్యేక అలంకరణలో కోదండరామస్వామి



సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు



పెదయిర్లపాడులో శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు

సింగరాయకొండ: మండలంలోని పలు ఆలయాల్లో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గల శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో సీతాలక్ష్మణ సమేత శ్రీరాముల వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. విష్ణుసహస్రనామం, గీతా పారాయణం నిర్వహించారు. శ్రీ చెట్టుమహాలక్ష్మమ్మ, పాతసింగరాయకొండ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంతో పాటు ఇతర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మర్రిపూడి: మండలంలోని గ్రామాల్లో బుధవారం తొలి ఏకాదశి పండుగను ఘనంగా జరుపుకున్నారు. భక్తులు వైష్ణవాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సంవత్సరంలో వచ్చే 24 ఏకాదశులలో ఆషాఢశుద్ధ ఏకాదశి నాటి నుంచి నాలుగు నెలలపాటు శ్రీ మహావిష్ణువు క్షీరసాగరంలో శేషతల్పంపై శయనిస్తాడని, ఆ రోజు ఉపవాసాలు ఉండి జాగారణచేసి మహావిష్ణువును పూజిస్తే విశేష ఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

ఉలవపాడు: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉలవపాడులోని వేణుగోపాలస్వామి దేవస్థానం, కరేడులోని కాళహస్తీశ్వరస్వామి దేవస్థానం, మన్నేటికోట అమరలింగేశ్వరస్వామి దేవస్థానం, ఉలవపాడులోని సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. ఉదయాన్నే తలంటి స్నానమాచరించి ఇళ్ల పరిశుభ్రంగా చేసుకుని ఆలయాలకు వచ్చి పూజలు నిర్వహించారు. కొబ్బరికాయలు కొట్టారు.

పీసీపల్లి: మండలంలోని గ్రామాల్లో బుధవారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. పండుగ పర్వదినం సందర్భంగా పెదయిర్లపాడు లో వెలసిన మహారుద్రపీఠంలో ఉన్న 1116 శివలింగాలకు భక్తులు పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని సహస్ర శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు.

వెలిగండ్ల: మండలంలోని పలు దేవాలయాల్లో తొలి ఏకాదశి వేడుకలను బుధవారం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాల్లో భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

పామూరు: తొలి ఏకాదశి (ఆషాడశుద్ధ ఏకాదశి) పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక రమా సమేత వీరవెంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం రమాసమేత సత్యనారాణస్వామిమూల విగ్రహాలకు పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమపూజ, విశిష్ట పూజలు చేశారు. అనంతరం 127 దంపతులచేత అర్చకులు చిమట కార్తీక్‌లు వేదమంత్రాలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహింపజేశారు. వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డి.వి.మనోహర్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దరిశి రాము, వాసవీమాత ఆలయ చైర్మన్ యేల్చూరి బాల కొండలరావు, సత్యనారాయణస్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పురాతన ఆలయం అయ్యలూరివారిపల్లెలోని శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథ స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం విశిష్ట పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామికి వేకువజామున అభిషేకం నిర్వహించారు. అదేవిధంగా శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు కుంకుమపూజ నిర్వహించారు. తొలి ఏకాదశి రోజున ఆలయంలో విశిష్ట పూజలు నిర్వహించడం విశేషం. పూజల్లో భక్తులు పాల్గొనగా వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అడ్మిషన్‌ల్లో ప్రకాశం ముందంజ

కందుకూరు: ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ ఈ ఏడాది అడ్మిషన్లలో విజయదుందుభి మోగించిందని కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య తెలిపారు. సివిల్, మెకానికల్ బ్రాంచ్‌లు మినహా అన్ని బ్రాంచ్‌లు 100శాతం కౌన్సెలింగ్ సీట్లు భర్తీ అయ్యాయని, మేనేజ్‌మెంట్ సీట్లు గత పది రోజుల క్రితమే నూరు శాతం సీట్లు భర్తీ అయినట్లు పేర్కొన్నారు. ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీపై మరోసారి విశ్వాసంతో తమ కాలేజీని ఎంపిక చేసుకున్నందుకు రామయ్య కృతజ్ఞతలు తెలిపారు. వారి పిల్లలను తీర్చిదిద్ది విశ్వాసాన్ని నిలుపుకుంటామని తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. ఒక చేత డిగ్రీ–మరో చేత ఉద్యోగం హామీని నిలబెట్టుకుని భవిష్యత్ తరాల పిల్లలను కూడా తమ కాలేజీలో చేర్చేలా వారి బిడ్డలను తీర్చిదిద్దామన్నారు. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్స్ బ్రాంచ్‌లకు దీటుగా ఇతర బ్రాంచ్‌ల విద్యార్థులకు కూడా మంచి ఉపాధితో ప్రోత్సహిస్తామని చెప్పారు. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ పూర్తి చేసుకుంటున్న మెకానికల్ విద్యార్థులను హీరో, హుండాయ్, అదాబీ కంపెనీల్లో 40 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని వివరించారు.

కుష్టువ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి




కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సింగరాయకొండ: కుష్టువ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స చేస్తే నివారించవచ్చని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ చైతన్యకృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ చైతన్యకృష్ణ మాట్లాడుతూ కుష్టువ్యాధిగ్రస్తుల శరీరంపై స్పర్శ లేని నొప్పి, దురద లేని మచ్చలు, చర్మంపై ఎర్రని లేదా రాగిరంగు మచ్చలు, కనురెప్పలు పూర్తిగా మూయలేకపోవడం, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం, చల్లని లేక వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, కాళ్ల నుంచి చెప్పులు జారిపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలు ఉన్నవారిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స చేస్తే వ్యాధిని నివారించవచ్చన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం జరుగుతుందన్నారు. వ్యాధిగ్రస్తులుగా గుర్తించిన వారికి ఉచితంగా చికిత్స చేసి వ్యాధిని నయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య పర్యవేక్షకుడు సయ్యద్ మసూద్‌అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

కో ఆర్డినేటర్ల సమస్యలు పరిష్కరించాలి

వెలిగండ్ల: స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్లుగా విధులు నిర్వహిస్తున్న కొంత మంది యూనియన్ నాయకులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రిని తాడేపల్లి క్యాంపు ఆఫీసులో కలిసి వినతిపత్రం అందజేశారు. స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి చెప్పినట్లు నాయకులు కోటేశ్వరరావు, శాస్త్రి, షేక్ ప్రక్రుద్దీన్ తెలిపారు.

వాసవీమాత ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



బాధ్యతలు చేపట్టిన నూతన పాలక వర్గం

కందుకూరు: పట్టణంలోని పెద్దబజార్‌లో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. ఆలయ నూతన అధ్యక్షుడిగా కోట వెంకట నరశింహ, గౌరవాధ్యక్షులుగా కొత్త వెంకటేశ్వర్లు, గౌరవ ప్రధాన కార్యదర్శిగా నల్లమల్లి వెంకటేశ్వర్లు, ఇతర సభ్యులతో ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని సన్మానించారు. నాయకులు మురారిశెట్టి సుధీర్‌కుమార్, తాతా లక్ష్మీనారాయణ, కోటా కిశోర్, గుర్రం అల్లూరయ్య, లైఫ్ స్టైల్ చిట్టి, కొణిజేటి రవి బ్రదర్స్, రవ్వా శ్రీనివాసులు పాల్గొన్నారు.